క్లుప్తంగా

ఆదాయ పన్ను చెల్లింపులపై నిర్లక్ష్యం వద్దు



మాట్లాడుతున్న ఇన్‌కం ట్యాక్స్ అధికారి

చిత్తూరురూరల్ (కాణిపాకం): ఆదాయ పన్ను చెల్లింపుల విషయంలో నిర్లక్ష్యం వహించరాదని జిల్లా ఇన్‌కం ట్యాక్స్ అధికారి కేవీ రమణారావు అన్నారు. చిత్తూరులోని ఓ హోటల్‌లో శుక్రవారం ఆదాయ పన్ను చెల్లింపుదారుల అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనల మేరకు పన్ను చెల్లింపుదారులు విధిగా తమ ఆదాయానికి సంబంధించిన పన్నులు చెల్లించాలన్నారు. ఆదాయపు వివరాలను సంబంధిత శాఖ అధికారులకు తప్పిదాలు లేకుండా తెలియజేయాలని కోరారు. సమావేశంలో ఇన్‌కం ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ సురేష్ కుమార్, కార్యాలయ సూపర్‌వైజర్ అశోక్, భరత్, ఆడిటర్ రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నిరోధక టీకాలు



టీకాలు వేస్తున్న పశు వైద్యాధికారిణి సాయిసుధ

గుడిపాల: పశువులకు సోకే గాలికుంటు వ్యాధి ప్రమాదకరమని పాడిరైతులు, పశుపోషకులు దీనిపై అప్రమత్తంగా ఉండాలని స్థానిక పశు వైద్యాధికారి సాయిసుధ అన్నారు. శుక్రవారం సీకే పల్లెలో పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేసి ఆమె మాట్లాడారు. పాడి రైతులు గాలికుంటు వ్యాధి టీకాల విషయంలో అపోహలు వీడి పశువులకు వేయించుకోవాలని, వీటివల్ల పాల దిగుబడి తగ్గదని స్పష్టం చేశారు. అంతేకాకుండా వాటి పని సామర్థ్యం కూడా పెరుగుతుందని పేర్కొన్నారు. వచ్చే నెల 3వ తేదీ వరకు గ్రామాల్లో టీకాలు వేస్తామన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్

– జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్

తవణంపల్లి: సీజనల్ వ్యాధుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం మండలంలోని దిగువమాఘంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభి యాన్ ఆరోగ్య శిబిరాన్ని జిల్లా మలేరియా అధికారి సందర్శించారు. అలాగే, దిగువమాఘంలో ఫ్రైడే డ్రైడే నిర్వహించారు. వర్షాకాలంలో ప్రజలు జ్వరాల బారిన పడకుండా పారిశుధ్యం మెరుగుపరచాలన్నారు. ఆ తర్వాత దిగువమాఘం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. గర్భవతులు, బాలింతలతో మాట్లాడారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ప్రియాంక, మోహన్‌వేలు, కేశవనారాయణ, డీఎంఓ సబ్‌యూనిట్ ఆఫీసర్ భానుప్రకాష్, సూపర్‌వైజర్ నారాయణ, సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, పీహెచ్‌ఎన్ జీవకళ, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సమావేశానికి విస్తృత ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సోమశేఖర్ రెడ్డి

సదుం: మండలంలోని ఎర్రాతివారిపల్లెలో శనివారం జరగనున్న వైఎస్సార్ సీపీ పుంగనూరు నియోజకవర్గ సమావేశానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు జెడ్పీటీసీ సోమశేఖర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి తెలిపారు. వారు శుక్రవారం ఏర్పాట్లను పరిశీలించారు. పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణా రెడ్డి, పలు నియోజకవర్గాల సమన్వయకర్తలు, ముఖ్య నాయకులు హాజరవుతారని చెప్పారు. నియోజకవర్గంలో ఇటీవల ఎంపికైన కమిటీల సభ్యులు తప్పక హాజరుకావాలన్నారు.

29న గంగమ్మకు పెద్దిరెడ్డి పట్టువస్త్రాలు సమర్పణ

చౌడేపల్లె: మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు ఈనెల 29న బోయకొండ గంగమ్మకు పట్టువస్త్రాలు సమర్పించనున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, జెడ్పీటీసీ దామోదరరాజు, పార్టీ మండల అధ్యక్షుడు నాగభూషణరెడ్డి, వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

కాత్యాయనీ నమోస్తుతే..!

కాణిపాకం: చిత్తూరులోని శ్రీదుర్గాంబ దేవస్థానంలో నిర్వహిస్తున్న నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం మూలవిరాట్‌కు అభిషేకం చేశారు. మధ్యాహ్నం కుంకుమార్చన నిర్వహించారు. రాత్రి కాత్యాయని దేవిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులకు ఆలయ చైర్మన్ దిలీప్‌రెడ్డి, ఈఓ తిమ్మారెడ్డి ప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే అ షిరిడిసాయి బాబా ఆలయంలో లలితా త్రిపుర సుందరీదేవి అలంకారం, కోదండరామస్వామి ఆలయంలో వరహావతారం, శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో వేంకటేశ్వరస్వామి అలంకారంలో భక్తులను అనుగ్రహించారు.

ధనలక్ష్మి అలంకారంలో పాలేటమ్మ

ఐరాల: స్థానిక పాలేటమ్మ అమ్మవారు శుక్రవారం కరెన్సీ నోట్ల అలంకరణతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వైఎస్.గేటులో చాముండేశ్వరిదేవి లలితా త్రిపుర సుందరి దేవిగా భక్తులకు కటాక్షించారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

గుడిపాలలో..

గుడిపాల: మండలంలోని కందగిరి కొండవద్ద ఉన్న శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి దేవాలయంలో శుక్రవారం మూలస్థాన దుర్గమ్మ కాత్యాయనీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.



కుంకుమార్చన చేస్తున్న భక్తులు

ఉదయం అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. అలాగే పిళ్లారికుప్పంలో ద్రౌపది ధర్మరాజుల దేవాలయంలో ఉదయం అమ్మవారికి ప్రత్యేకంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. సాయంత్రం మహాలక్ష్మిదేవిగా భక్తులను కటాక్షించారు.

మహా చండీదేవిగా వజ్రాలపురం గంగమ్మ

బంగారుపాళెం: మండలంలోని వజ్రాలపురం బోయకొండ గంగమ్మ శుక్రవారం శ్రీమహాచండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి పూజలు, అభిషేకాల అనంతరం బోయకొండ గంగమ్మను మహాచండిదేవిగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. బంగారుపాళ్యానికి చెందిన రాయల్ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం ఉభయ దారులుగా వ్యవహరించింది. ఆలయ ధర్మకర్త కృష్ణప్ప, మేనేజర్ మొగిలప్ప, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అన్నపూర్ణదేవిగా ముత్యాలమ్మ

బంగారుపాళెం గ్రామదేవత ముత్యాలమ్మ శుక్రవారం సాయంత్రం అన్నపూర్ణదేవిగా పూజలు అందుకున్నారు. ఆలయ అర్చకులు మురళీగురుకుల్, కమిటీ చైర్మన్ కృష్ణమూర్తి, సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



కాత్యాయనిదేవిగా దుర్గాంబ



ఐరాల: వైఎస్ గేటులో..



ఐరాల: కరెన్సీ నోట్లతో ధనలక్ష్మి అలంకారంలో పాలేటమ్మ



గుడిపాల: కందగిరికొండ వద్ద..



గుడిపాల: పిళ్లారికుప్పం వద్ద..



బంగారుపాళెం: మహాచండీదేవిగా వజ్రాలపురం బోయకొండ గంగమ్మ



బంగారుపాళెం: అన్నపూర్ణదేవిగా ముత్యాలమ్మ

నోటీస్ బోర్డు

నేడు అంతర్జాతీయ బధిరుల దినోత్సవం

చిత్తూరు కలెక్టరేట్: స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో శనివారం ఉదయం 10 గంటలకు అంతర్జాతీయ బధిరుల దినోత్సవం నిర్వహించనున్నట్లు శుక్రవారం జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ వినోద్ విలేకరులకు తెలిపారు. జిల్లాలోని బధిరులు, సంఘాల నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు హాజరుకావాలని కోరారు. బధిర ప్రభుత్వ ఉద్యోగులకు ఓడీ సౌకర్యం ఉందని, దీనిని ఆయా శాఖల ఉన్నతాధికారులకు తెలియజేసి కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

నేడు మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరం

ఐరాల: కాణిపాకం పీహెచ్‌సీలో శనివారం స్వస్థ్ నారీ–సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైద్యాధికారులు స్వాతి సింధూర, రాజేశ్వరి తెలిపారు. మహిళలకు ప్రత్యేక వైద్య నిపుణులతో వైద్య శిబిరం నిర్వహిస్తామని, గుండె జబ్బులు, మధుమేహం, నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ పరీక్షలు చేయనున్నట్లు చెప్పారు. ఈ శిబిరాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు

మారిన ఖాతా నంబర్లలను ట్రెజరీలో తెలియజేయండి

చిత్తూరు కలెక్టరేట్ : సప్తగిరి గ్రామీణ బ్యాంకుల్లో పెన్షన్ పొందుతున్న విశ్రాంత ఉద్యోగులు మారిన ఖాతా నంబర్లు, ఏఎఫ్‌ఎస్‌సీ కోడ్‌లను ఆయా ట్రెజరీల్లో వెంటనే తెలియజేయాలని శుక్రవారం ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజ విలేకరులకు తెలిపారు. జిల్లాలోని సప్తగిరి గ్రామీణ బ్యాంకులను ఇటీవల ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులుగా మార్పు చేసిందని, మారిన వివరాలను విశ్రాంత ఉద్యోగులు అందజేయకపోతే పెన్షన్ బిల్లులు సిద్ధం చేయరని తెలియజేశారు.

రేషన్ కోసం అగచాట్లు

- మా ఊరిలోనే నిత్యావర సరకులు ఇవ్వండి
- తహసీల్దార్‌కు చామంతిపురం గ్రామస్తుల వినతి

గుడిపాల: రేషన్ షాపుల్లో నిత్యావసరకులు తీసుకోవాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నామని శుక్రవారం మండలానికి చెందిన చామంతిపురం గ్రామస్తులు తహసీల్దార్ శ్రీనివాసులుకు సమస్యలు నివేదించారు. రోడ్డుమార్గం గుండా వెళ్లాలంటే ఐదు కిలోమీటర్లు వెళ్లాలని, అడ్డదారిలో వెళ్లాలంటే వాగుతో పాటు రైల్వేట్రాక్ దాటి వెళ్లాల్సి వస్తోందన్నారు. అయితే ప్రస్తుతం అటువైపు వర్షపు నీరు అధికంగా వెళ్తోందని, దీని వల్ల రేషన్‌కు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. తమ గ్రామంలో 103 రేషన్‌కార్డులు ఉన్నాయని, కార్డుదారుల్లో ఎక్కువగా వృద్ధులే ఉన్నారని, తమ సమస్యలు దృష్టిలో ఉంచుకుని గ్రామంలో రేషన్ సరకులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై తహసీల్దార్ సానుకూలంగా స్పందించారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

రూ.4.79 లక్షలతో అభివృద్ధి పనులు

చిత్తూరు కలెక్టరేట్: పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెనరా బ్యాంక్ సీఎస్ఆర్ (కార్పొరేట్ సామాజిక బాధ్యత) నిధులు రూ.4.79 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ జీవనజ్యోతి అన్నారు. శుక్రవారం కళాశాలలో పనులను ప్రారంభించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ, చిత్తూరు విద్యారంగంలో దశాబ్దాలుగా తనదైన ముద్ర వేసిన పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) అభివృద్ధిలో మరో ముందడుగు వేసిందన్నారు. విద్యార్థులకు, సిబ్బందికి మెరుగైన మౌలిక వసతులు కల్పించాలనే లక్ష్యంతో కెనరా బ్యాంక్ చిత్తూరు శాఖ తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమంలో ముందుకు రావడం హర్షణీయమన్నారు. 1961లో స్థాపించిన పీవీకేఎన్ ప్రభుత్వ కళాశాల రాయలసీమకే తలమానికమన్నారు. ఈ కళాశాల ఎందరో మేధావులను, ఉన్నతాధికారులను, నాయకులను ఈ సమాజానికి అందించిందన్నారు. ప్రస్తుతం ఎస్వీయూ అనుబంధంగా న్యాక్–ఏ గ్రేడ్ గుర్తింపు పొంది, విద్యార్థులను నాణ్యమైన విద్య నందిస్తోందని, విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కళాశాలలో మౌలిక వసతులు అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కెనరా బ్యాంక్ జీఎం, పీవీకేఎన్ కళాశాల పూర్వ విద్యార్థి ఢిల్లీబాబు, తిరుపతి రీజినల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ రామమోహన్, చిత్తూరు కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజర్ సత్యమూర్తి, వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర, న్యాక్ కో–ఆర్డినేటర్ హరిప్రసాద్, అధ్యాపకులు శరవణ, గోపినాయక్, భాను, బాషా తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభోత్సవంలో కెనరా బ్యాంక్ ప్రతినిధులు

బాలకృష్ణ వ్యాఖ్యలపై ఆగ్రహం



బాలకృష్ణ వ్యాఖ్యలపై పలమనేరులో నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- పలమనేరులో అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం
- బాలకృష్ణపై చర్యలు తీసుకోవాలని నిరసనలు

పలమనేరు: హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ అసెంబ్లీలో సినీ నటుడు చిరంజీవిపై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై వైఎస్సార్ సీపీ శ్రేణులు భగ్గుమన్నాయి. శుక్రవారం ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ నుంచి ర్యాలీ చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నిరసన వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ హేమంత్‌కుమార్‌రెడ్డి, నాయకులు చెంగారెడ్డి, ప్రహ్లాద, ముజ్జు మాట్లాడుతూ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో హుందాగా వ్యవహరించాలన్నారు. బాలకృష్ణ వాడు, వీడు అని అనుచితంగా వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. సీఎం చంద్రబాబు, స్పీకర్ అయ్యన్నపాత్రులు సైతం అభ్యంతరం చెప్పకపోవడం సిగ్గుచేటన్నారు. తరచూ చిరంజీవిని అవమానించడం, కాపు సామాజిక వర్గాన్ని తక్కువ చేసి మాట్లాడడం బాలకృష్ణకు అలవాటుగా మారిందని దుయ్యబట్టారు. తన అన్న చిరంజీవికి ఇంత అవమానం జరుగతున్నా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించకపోవడం దారుణమన్నారు. నిరసనలో మున్సిపల్ వైస్ చైర్మన్ రవి, నాయకులు రహీంఖాన్, శ్యామ్, నాగరాజు, కమాల్, సుబ్రమణ్యం నాయుడు, జమీలా, కిశోర్, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

సమతుల ఆహారంతోనే ఆరోగ్యం

ఐరాల: గర్భిణులు, బాలింతలు సమతుల ఆహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండవచ్చని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రెడ్డెప్ప అన్నారు. శుక్రవారం పీహెచ్‌సీలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి ఆధ్వర్యంలో 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే, స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం ఏర్పాటు చేసి మహిళలకు వైద్య పరీక్షలు చేశారు. రెడ్డెప్ప మాట్లాడుతూ, గర్భిణులు తీసుకునే ఆహారంలో పిండిపదార్థాలు, మాంసకృత్తులు, విటమిన్లు, ఖనిజ లవణాలు సమతులంగా ఉన్నప్పుడే శరీరం బలంగా, ఆరోగ్యంగా ఉంటుందన్నారు. గ్రామాల్లో అందుబాటులో ఉన్న తాజా కూరగాయలు, పప్పు దినుసలతో తక్కువ ఖర్చుతోనే పోషకాహారం పొందవచ్చన్నారు. గైనకాలజిస్టు అనుశక్తి మాట్లాడుతూ, గర్భిణులు ప్రతి నెలా హిమోగ్లోబిన్ శాతం చూసుకోవాలని, ప్రభుత్వాస్పత్రుల్లోనే ప్రసవం చేయించుకోవాలని కోరారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి మాట్లాడారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్లు శ్రీధర్‌బాబు, వెంకటేశ్వర్లు, హెల్త్ సూపర్‌వైజర్ చిన్నమ్మ, హెల్త్ అసిస్టెంట్ మునిరత్నం, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యాధికారి రెడ్డెప్ప

గుడిపాలలో..

గుడిపాల: పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి సంధ్య అన్నారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా శుక్రవారం పీహెచ్‌సీలో సర్పంచ్ రజనీకాంత్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. మహిళలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ మాట్లాడారు. గర్భిణులు, బాలింతలకు పోషకాహార లోపంతో వచ్చే వ్యాధులు, ఎన్సీడీ వ్యాధులు, వ్యాధి నిరోధక టీకాలు, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలపై అవగాహన కల్పించారు. ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్లు ఉషశ్రీ, వినీల్, మునిక్రిష్ణ, అర్పిత, సీహెచ్‌ఓ బాలసూర్య నారాయణ, సిబ్బంది చంద్రశేఖర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణపురంలో..

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం సత్యనారాయణపురంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. మహిళలకు వైద్యులు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వివిధ వ్యాధులు, వాటికి చికిత్స గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, బీజేపీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



గుడిపాల: మాట్లాడుతున్న డాక్టర్ సంధ్య



సత్యనారాయణపురంలో మాట్లాడుతున్న వైద్యుడు

ఈ–క్రాప్ నమోదుతోనే ప్రభుత్వ పథకాల వర్తింపు



బంగారుపాళెం:గొల్లపల్లెలో ఈ–క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఉమ



నలిశెట్టిపల్లెలో ఈ–క్రాప్ నమోదు చేస్తున్న ఏఓ ప్రవీణ్, సిబ్బంది



గుడిపాల: ఈ–పంట నమోదు చేస్తున్న దృశ్యం

బంగారుపాళెం: రైతులు సాగు చేసిన పంటలను ఈ–క్రాప్ నమోదు చేసుకుంటేనే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని చిత్తూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఉమ అన్నారు. శుక్రవారం మండలంలోని గొల్లపల్లెలో ఈ–క్రాప్ నమోదును ఆమె పర్యవేక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ఈ–క్రాప్ నమోదు పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రైతులు ఈ–క్రాప్ నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి పంటకూ ఈ–క్రాప్ బుకింగ్

తవణంపల్లె: రైతులు సాగు చేసిన ప్రతి పంటకూ ఈ–క్రాప్ బుకింగ్ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి జి. ప్రవీణ్ కోరారు. శుక్రవారం మండలంలోని నలిశెట్టిపల్లె, టి.పుత్తూరులో ఈ–క్రాప్ బుకింగ్‌ను పరిశీలించి ఆయన మాట్లాడారు. రైతులు రైతు సేవా కేంద్రం సిబ్బందితో ఈ–క్రాప్ బుకింగ్ చేసుకోవాలని, ఇది చేసుకోని పక్షంలో ప్రభుత్వ పథకాల లబ్ధి పొందలేరని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గుడిపాలలో..

గుడిపాల: ఈ–పంట నమోదు ప్రతి రైతూ చేయించుకోవాలని వ్యవసాయాధికారి సంగీత కోరారు. శుక్రవారం బసవాపల్లెలో అగ్రికల్చర్ అసిస్టెంట్లు చేస్తున్న ఈ–పంట నమోదును పరిశీలించి ఆమె మాట్లాడారు.

తరగతుల నిర్వహణపై ఏఐఎస్ఎఫ్ నేతల నిరసన

పలమనేరు: పట్టణంలోని కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో దసరా సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్నారని, అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు శుక్రవారం స్థానిక ఎమ్మార్సీ వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేటు స్కూళ్ల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా నాయకులు ప్రవీణ్‌కుమార్, సంజయ్, రిషి, అమాంశ్ తదితరులు పాల్గొన్నారు



నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నేతలు